క్లుప్తంగా

వరుణుడి కరుణ కోసం వరద పాయసం



నీలకంఠ సాగర్ పొర్లు వద్ద వరద పాయసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జింకిభద్ర రైతులు

సోంపేట: మండలంలోని జింకిభద్ర గ్రామానికి చెందిన రైతులు వర్షాలు కురవాలని కోరుతూ వరద పాయసం కార్యక్రమాన్ని నిర్వహించారు. నీలకంఠ సాగర్ ఆయకట్టు రైతులు సాగర్ పొర్లు వద్ద వరద పాయసం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పాయసం వండి వర్షం కురవాలని వరుణ దేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు లేక పోవడంతో నారు మడులు ఎండి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

వైశ్య సంఘం నూతన కార్యవర్గం



ఆలయ ఆవరణలో ప్రమాణం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

పలాస: పలాస వైశ్య సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయం మందిరంలో ఆదివారం కార్యవర్గం ఎన్నిక, ప్రమాణ స్వీకారం జరిగింది. అధ్యక్షునిగా ప్రముఖ వ్యాపారివేత్త దోకి నాగేశ్వరరావు, కార్యదర్శిగా తంగుడు కామేశ్వరరావు, కోశాధికారిగా కోట్ని శశికుమార్‌ను ఎన్నుకున్నారు. అనంతరం వైశ్య సంఘం పెద్దల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గ సభ్యులను రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దోకి రామారావు తదితరులు అభినందించారు.

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలి



సమావేశంలో పార్టీ శ్రేణులు

మందస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మందస మండలంలో మరింత బలోపేతం చేయాలని నాయకులు అన్నారు. వి.జి పురం గ్రామంలోని దత్తాత్రేయ ఆశ్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దల్లి జానకిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలంలో ఇటీవల నిర్వహించిన 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం విజయవంతం కావడంతో కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే పార్టీ గ్రామ కమిటీల నియామకాన్ని త్వరగతిన పూర్తి చేయాలని నిర్ణయించారు. పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై సోషల్ మీడియా వేదికగా ఎన్నో దుష్ప్రచారాలు చేస్తున్నారని..వాటికి దీటుగా బదులు ఇవ్వాలన్నారు. ఎంపీపీ దానయ్య, నాయకులు గోపాల్, శానపతి కిశోర్, పీతంబరం, చింతాడ గణపతి, బృందా, జి.తారుపతిరెడ్డి పాల్గొన్నారు.

గురుకులానికి ఫ్యాన్లు వితరణ



ఫ్యాన్లు అందజేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లిలోని బీసీ గురుకుల పాఠశాలకు పవనపుత్ర సేవా సంస్థ ప్రతినిధులు ఫ్యాన్లు, ట్యూబులైట్స్, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకన్న చౌదరి, సంస్థ అధ్యక్షులు ఎం.భాస్కరరావు, విశ్రాంతి ప్రిన్సిపాల్ ముంజేటి పాపారావు ఉన్నారు.

పర్యాటక కేంద్రంగా తేలినీలాపురం



పక్షుల విడిది కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి రూరల్: పక్షుల విడిది కేంద్రమైన తేలినీలాపురం గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. ఆదివారం సాయంత్రం తెలినీలాపురం పక్షుల విడిది కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ఎకోటూరిజం ద్వారా దీన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. అనంతరం గ్రామంలోని ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి ఉన్నారు.

ఉచిత బస్సు ప్రయాణం అందని ద్రాక్షే?



మూడువేలకు పైగా మహిళా జనాభా ఉన్న ఈదుపురం



పక్కా తారు రోడ్డు ఉన్నా.. పల్లెవెలుగు సర్వీసుకు నోచుకోని దొంకూరు మత్స్యకార గ్రామం రోడ్డు



పల్లెవెలుగు బస్సు

- ఇచ్ఛాపురం నియోజకవర్గంలో అధిక గ్రామాలకు నడవని బస్సులు
- పల్లె వెలుగు సర్వీసులు లేకుండా ఉచిత ప్రయాణం ఎలా సాధ్యం
- ఇప్పటికీ గ్రామస్తులకు ఆటో ప్రయాణమే దిక్కు

ఇచ్ఛాపురం రూరల్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ఈ నెల 15వ తేదీ నుంచి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే పల్లె వెలుగు బస్సు సర్వీసులు లేని గ్రామాలు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 80 శాతం వరకు ఉన్నాయి. ఈ పరిస్థితిలో ఉచిత బస్సు పథకం చాలా గ్రామాల మహిళలకు అందని ద్రాక్షగానే మారనుంది. పక్కా తారురోడ్లు ఉన్నప్పటికీ ప్రైవేటు బస్సులు, ఆటోలు తప్పా.. ఈ రోడ్లపై పల్లె వెలుగు బస్సులు పరుగులు తీసిన సందర్భం లేదు. మిగిలిన గ్రామాలకు అరకొరగానే వెళ్తున్నాయి. పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు, మెట్రో, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణాన్ని కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నియోజకవర్గంలో ప్రధాన రహదారులపై ఉన్న గ్రామాల ప్రజలకు పల్లె వెలుగు బస్సులు అందుబాటులో ఉన్నాయే తప్పా...మారుమూల గ్రామాల ప్రజలకు బస్సు సర్వేసులు అందుబాటులో లేవు. అంబుగాం నుంచి మామిడిపల్లి–బారువ–సోంపేట–కంచిలి–కొజ్జిరియా మీదుగా ఇచ్ఛాపురం వరకు, సోంపేట నుంచి మాణిక్యపురం–బొరివంక–కవిటి–రాజపురం మీదుగా ఇచ్ఛాపురం వరకు, కంచిలి–ఎంఎస్‌పల్లి–బైరిపురం వరకు మాత్రమే బస్సు సర్వీసులు అందుబాటులో ఉండగా, సోంపేట మండలం బట్టిగళ్లూరు, బాతుపురం, పొత్తంగి, కంచిలి మండలం కేసరపడ, ముండలా, గంగాధరపురం, ఇచ్ఛాపురం మండలంలోని కొళిగాం గ్రామాలకు పల్లె వెలుగు బస్సులు అరకొర గానే ఉన్నాయి.

పల్లె వెలుగు లేని గ్రామాలు ఎన్నో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జనాభా అధికంగా ఉండే గ్రామాలకు వెళ్లేందుకు అవసరమైన పక్కా తారురోడ్లు నిర్మించారు. అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని మాదిరిగా ఈ రూట్లలో పల్లె వెలుగు బస్సు సర్వీసులు లేకపోగా, ప్రైవేటు బస్సులు, ఆటోలు మాత్రం ఇష్టానుసారంగా ప్రయాణికులను దోచుకుంటున్నారు. ఇచ్ఛాపురం మండలంలో లక్ష్మీపురం, డొంకూరు, బూర్జపాడు, కేశుపురం, ఈదుపురం, కొఠారీ, ధర్మపురం, తులసిగాం, ఇన్నేసుపేట, పురుషోత్తపురం, కేధారిపురం, ముచ్చింద్ర, బాలకృష్ణాపురం, జగన్నాథపురం, టి.బరంపురం, కె.శాసనాం గ్రామాలకు పక్కా తారు రోడ్లు ఉన్నా బస్సు సర్వీసులు లేవు. కవిటి మండలం కవిటి నుంచి డి.గొనపపుట్టుగ, జల్లుపుట్టుగ, తిప్పనపుట్టుగ, ఈదుపురం వరకు పక్కా తారు రోడ్డు ఉన్నా పల్లె వెలుగు సర్వీసులు వెళ్లవు. అలాగే రాజపురం నుంచి బైరిపురం మీదుగా జల్లుపుట్టుగ జంక్షన్, కవిటి నుంచి పి.కె.పాలెం, ఇద్దువానిపాలెం, బొరివంక వరకు, కవిటి నుంచి ప్రగడపుట్టుగ మీదుగా కపాసుకుద్ది, జలవంక వరకు, జగతి నుంచి శిలగాం, మంగళవారం సంత వరకు, లోళ్లపుట్టుగ నుంచి బి.గొనపుపుట్టుగ మీదుగా దూగానపుట్టుగ, సహలాలపుట్టుగ, బెలగాం జంక్షన్ వరకు, లొళ్లపుట్టుగ నుంచి నర్తుపుట్టుగ మీదుగా మఖరాంపురం, ఆదివారం సంత వరకు, కంచిలి మండల కేంద్రం నుంచి కత్తివరం మీదుగా మాణిక్యపురం వరకు, అదే రహదారిలో శ్రీరాంపురం మీదుగా పత్రిపుట్టుగ వరకు పక్కా తారురోడ్లు ఉన్నప్పటికీ పల్లెవెలుగు సర్వీసులు లేవు. ఈ రహదారుల్లో ఆటోలదే హవా. సోంపేట మండలం పాలవలస నుంచి పాత్రఖండ వరకు తళతళ మెరిసే తారురోడ్డు ఉన్నప్పటికీ పల్లెవెలుగు సర్వీసులకు మోక్షం లేదు.

ఆటోలు, ప్రైవేటు బస్సులే గతి..

అర్ధ రూపాయి కూరకి ఆరు రూపాయల మసాలా అన్నట్లు మహిళలు ఉచిత బస్సులో ప్రయాణించాలంటే అధిక మొత్తంలో ఆటోలకు, ప్రైవేటు బస్సులకు చార్జీలు ఇవ్వాల్సిందే. ఇక వ్యక్తిగత పనులపై మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలన్నా, బ్యాంకులకు రావాలన్నా ఆటోలు, ప్రైవేటు బస్సులు ఎక్కి ప్రయాణించాల్సిందే. ఉదాహరణకు ఇచ్ఛాపురం మండలం పెద్దలక్ష్మీపురం నుంచి ఇచ్ఛాపురం మండల కేంద్రానికి రావాలంటే సుమారు 15 కిలో మీటర్లు ఆటోలు, ప్రైవేటు బస్సులు ఎక్కాల్సిందే. అందుకు ఒకవైపు రూ.40 వరకు టిక్కెట్ చార్జి ఇవ్వాల్సిందే. అలాగే పాత్రఖండ నుంచి సోంపేటకు 25 కిలోమీటర్లు దూరం. ప్రైవేటు బస్సులో అయితే రూ.50 టికెట్, ఆటోలో వెళ్లాలంటే వందల రూపాయలు వెచ్చించాలి. నియోజకవర్గంలో పల్లె వెలుగు సర్వీసులు లేని గ్రామాలే అధికం. దీంతో 80 శాతం మంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందని ద్రాక్షగానే మిగిలిపోయే అవకాశం ఉంది.

ఉచిత బస్సు నడపాలి



సూపర్ సిక్స్ హామీలో భాగంగా మహిళలకు ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం అంటూ కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 80 శాతం మంది మహిళలు పల్లెవెలుగు వెళ్లని గ్రామాల్లోనే ఉన్నారు. గ్రామీణ మహిళలకు ఈ పథకం అందాలంటే బస్సు సర్వీసులు లేని గ్రామాలకు బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలి.

– బోర పుష్ప, ఎంపీపీ, ఇచ్ఛాపురం

ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి



గ్రామీణ మారుమూల ప్రాంతం మాది. గత ప్రభుత్వం హయాంలో పక్కా తారురోడ్డు వేశారు. మా గ్రామానికి బస్సు సౌకర్యం ఉన్నప్పటికీ ఉదయం, సాయంత్రం మాత్రమే సర్వీసు ఉంది. దీంతో ఆటోలను ఆశ్రయించడం జరుగుతోంది. మా ప్రాంతాలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి.

– డి.భారతిరెడ్డి, మశాఖపురం, ఇచ్ఛాపురం మండలం

చంద్రబాబును ప్రజలు విశ్వసించరు



సోంపేట: గొల్లూరు గ్రామంలో మహిళలతో కలిసి ర్యాలీలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

సోంపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు మాయమాటలను ప్రజలు విశ్వసించడం లేదని జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ అన్నారు. గొల్లూరు పంచాయతీ పరిధిలో 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం మోసాలను తెలియజేశారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో చేసిందేమి లేదని వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మోసాలతో కూడిన క్యూఆర్ కోడ్ పత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సిలగాన భాస్కరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ బుద్దాల శ్రీక్రిష్ణ, స్థానిక సర్పంచ్ పిన్నింటి ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు పిన్నింటి ఫూన్సీ, ఉప్పలాం సర్పంచ్ బట్టి మాధవరావు, నాయకులు పిన్నింటి రేఖారావు, గోకర్ల ధర్మారావు పాల్గొన్నారు.

వెన్నుపోటు చంద్రబాబు నైజం



నందిగాం: కణితూరులో బాబు మోసాల కరపత్రాలు చూపుతున్న నాయకులు, మహిళలు

నందిగాం: నమ్మినవారిని వెన్నుపోటు పొడిచి మోసం చేయడమే చంద్రబాబు నైజమని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. కణితూరులో జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పేరాడ రమేష్ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ముందు బాబు ఇచ్చిన హామీలు, అవి నెరవేర్చకుండా చేసిన మోసాలను వివరించారు. మహిళలకు, రైతులకు, నిరుద్యోగులకు చంద్రబాబు చేసిన మోసాలపై గ్రామంలో ర్యాలీ చేపట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, జడ్యాడ జయరాం, చిన్ని జోగారావు, కణితి నారాయణమూర్తి, అంబోడి విష్ణు, సర్లాన బైరాగి, బొమ్మాళి గున్నయ్య, తమిరె రాజు, నందిగాం శ్యామసుందరరావు, బొంగి హనుమంతురావు, తమిరె దేవేంద్రరావు, కవిటి ఎర్రన్న, పైల కరుణాకర్, పొందల లచ్చయ్య, కోనారి రామారావు, రత్నాల చిట్టిబాబు, బార్నాన బాబూరావు, టొపం రామారావు, బాలక ప్రభాకరరావు, అట్టాడ అప్పన్న కణితి కేశవరావు, రామారావు,బరకట ఈశ్వరరావు, పేరాడ అనిల్ కుమార్, గుమ్మడి భార్గవ్, మెట్ట రమేష్, బగాతి రామదాసు, పాలవలస రఘుపతి, బగాతి లోకనాథం, గుమ్మడి మురళి పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి



పర్యావరణానికి తీరని ముప్పు కలిగిస్తున్న ప్లాస్టిక్‌ను నిషేధించాలని.. దీనికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కె.కామేశ్వర్రావు కోరారు. ఆదివారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సభ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా పర్యావరణానికి హాని కలిగిస్తున్న ప్లాస్టిక్‌ను నిషేధించడానికి పాలకులు సహకరించాలని కోరారు. దీని కోసం చైతన్యవంతమైన కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కె.ధర్మారావు, బి.శంకరరావు, టి.వైకుంఠరావు, డి.పాపారావు, బి.అరుణ్‌కుమార్, జి.మోహన్‌రావు, శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

–టెక్కలి

నారీశక్తితో మహిళలకు భద్రత



మహిళల భద్రతకు నారీశక్తి యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఇచ్ఛాపురం రూరల్ ఎస్సై ఇ.శ్రీనివాస్ అన్నారు. లొద్దపుట్టి జంక్షన్‌లో మహిళలకు నారీశక్తిపై ఆదివారం అవగాహన కల్పించారు. మహిళా భద్రత, శక్తి యాప్ ఆవశ్యకత, ఉపయోగం , ప్రయోజనం, మహిళలపై సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్న వేధింపులు, సైబర్ మోసాలుపై అప్రమత్తం, బాల్య వివాహాలు నియంత్రణపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

విద్యారంగాన్ని పరిరక్షించాలి



మందస: యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

మందస: విద్యా రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిరక్షించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫేడరేషన్ నాయకులు కోరారు. యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల శాఖ అధ్యక్షులు జగదీష్ బడిత్య అధ్యక్షతన హరిపురం గ్రామంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు, పాలకులు విద్యా సంస్కరణలతో 12,572 పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్ జెండాను నాయకులు ఆవిష్కరించారు. సంఘ ప్రతినిధులు జన్ని సోమేష్, కోండలరావు, మాధవరావు, శిష్టు సోమనాథ్, కిరణ్, గున్న రమణ ఉన్నారు.

టెక్కలి: యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక వైఎస్సార్ జంక్షన్ వద్ద ఆ శాఖ నాయకులు జెండాను ఆవిష్కరించారు. సంఘ ప్రతినిధులుపాలవలస ధర్మారావు, కుట్టిల కామేశ్వరరావు, జర్జాన చంద్రశేఖర్‌రావు, గౌరవ అధ్యక్షులు కుమార స్వామి, ట్రెజరర్ విజయ్‌కుమార్, డొంకాన పాపారావు, వైకుంఠరావు, మూడదాని రాము, సత్యన్నారాయణ పాల్గొన్నారు.

నందిగాం: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సంక్షేమానికి యూటీఎఫ్ ఆవిర్భావం జరిగిందని నందిగాం మండల శాఖ అధ్యక్షుడు కె.కుమారస్వామి అన్నారు. నందిగాంలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి బాలక శంకరరావు, మండల ప్రధాన కార్యదర్శి వై.గణపతి, గౌరవాధ్యక్షులు కె.ధర్మారావు పాల్గొన్నారు.

పలాస: విద్యారంగ పరిరక్షణతో పాటు ఉపాధ్యాయుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తుందని సంఘ జిల్లా కార్యదర్శి కంచరాన రమేష్ అన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమం జరిగింది. యూటీఎఫ్ పతాకాన్ని పలాస మండల శాఖ గౌరవ అధ్యక్షులు కె.ప్రసాదరావు ఎగురవేశారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



పరామర్శలో ఎంపీపీ దేవదాస్‌రెడ్డి తదితరులు

కంచిలి: మఠం సరియాపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ అభిమాని పిలక రామయ్య అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో అతని కుటుంబ సభ్యులను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. స్థానిక సర్పంచ్ కొణపల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథంరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గేదెల మాదాలు, బదకల ఢిల్లీరావు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



విశాఖ కోఆప్‌రేటివ్ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలను అందిస్తున్నామని బ్యాంకు డైరెక్టరు కంద ప్రసాదరావు చెప్పారు. పలాస బ్రాంచి ఆవరణలో ఆదివారం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ బ్యాంకులకు దీటుగా విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఖాతాదారుల పిల్లలకు ప్రతి ఏడాది పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతులను ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో విజయనగరం జోనల్ మేనేజరు జక్కా శ్రీనివాసరావు, జి.ఎల్.వి.ప్రకాషరావు, బ్యాంకు మేనేజరు కనకమహాలక్ష్మి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

–పలాస

చినుకు ఎడబాటు.. రైతు తడబాటు!

- జాడలేని వరుణుడు
- ఎండిపోతున్న వరినారు వడులు



సోంపేటలో ఎండిపోతున్న వరినారు

సోంపేట: వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో ఖరీఫ్ సాగు పనులు ముందుకు సాగక రైతు తడబడుతున్నాడు. జూన్‌లో కురిసిన వర్షాలతో వ్యవసాయ పనులు ఆరంభించిన రైతుకు ఆ తరువాత కష్టాలు ఆరంభమయ్యాయి. సరైన వర్షాలు, నీటి వనరుల్లేక వేసిన వరినారు మడులు కళ్లెదుటే ఎండిపోతున్నాయి. నారుమడులను రక్షించుకుందామంటే చెరువుల్లో కూడా చుక్క నీరు లేదు. సోంపేట మండలంలో 12 వేల ఎకరాల్లో వరి సాగు చేయడానికి రైతులు సిద్ధమయ్యారు. ఇప్పటి వరకు కేవలం సుమారు ఐదు వందల ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారు. అలాగే 700 ఎకరాల్లో వెద సాగు చేస్తున్నారు. మిగతా 11 వేల ఎకరాలు బీడుగా దర్శనం ఇస్తుంది. వరినారు మడులు సిద్ధం చేసి 40 రోజులు కావడం.. వర్షాలు లేకపోవడంతో ఎండిపోతున్నాయి.



వరినారును కాపాడుకోవడానికి నీరు పెడుతున్న రైతు

వాస్తవ పరిస్థితి ఇలా..

సాధారణంగా వరి నారు మొలకెత్తిన తరువాత 25 నుంచి 30 రోజుల్లో నాట్లు వేయాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. నిర్ణీత సమయంలో నాట్లు వేయక పోతే పిలకలు తగ్గి పంట దిగుబడిపై ప్రభావం చూపిస్తుంది. అంతే కాకుండా తెగుళ్లు కూడా అధికంగా సోకే అవకాశం ఉంది. నెల రోజుల దాటిన తరువాత నాట్లు వేస్తే తమ సలహాలు తీసుకోవాలని వ్యవసాయ సిబ్బంది సూచిస్తున్నారు.

నారు మడులను సంరక్షించుకోవాలి

ఎండుతున్న నారు మడులను నాలుగైదు రోజులు కాపాడుకోవడానికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఇప్పుడిప్పుడే ఎండి పోతున్న నారుకు పొటాషియం నైట్రేట్ ఐదు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే కొద్దిరోజులు నారు ఎండిపోకుండా ఉంటుందంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్య



ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి ఖరీఫ్ పంల సమస్యను తీసుకెళ్లాం. సోంపేట మండలంలో రైతులు వర్షాధారంగా వరి నారు వేయడం ఆనవాయితీ. సరైన వర్షాల్లేకపోతే నారుమడులు ఎండి పోతాయి. ప్రస్తుత అన్ని గ్రామాల్లో నారు మడులు ఎండి పోతున్నాయి. ఇదే పరిస్థితి మరో నాలుగైదు రోజులు ఉంటే వరినారు పూర్తిగా పాడవుతుంది. ఇదే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ,రైతులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం జరుగుతుంది. అవసరమైన రైతులకు స్వల్పకాలిక విత్తనాలు అందజేస్తాం.

–బి.నర్సింహమూర్తి, వ్యవసాయాధికారి

పిల్లలకు దుస్తులు పంపిణీ

పలాస: కాశీబుగ్గ బాల సదనంలోని పేద పిల్లలకు పవనపుత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆదివారం దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. పేద విద్యార్థులకు తగిన ఆర్థిక సహకారం అందించాలని కోరారు. పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.